ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలను పలువురు అధికారులు పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


కురుపాం: పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టిక్కెట్ల నంబర్లను చూస్తున్న విద్యార్థులు


వీరఘట్టం: ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీలు చేస్తున్న పోలీసులు


కొమరాడ: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


సీతంపేట: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు


గుమ్మలక్ష్మీపురం: ఇంటర్ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



భామిని: పరీక్షలు రాసి వస్తున్న ప్రథమ ఇంటర్ విద్యార్థులు


జియ్యమ్మవలస: చినమేరంగి జూనియర్ కళాశాల వద్ద గస్తీ కాస్తున్న పోలీసులు

క్లుప్తంగా

సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని దీసరిగూడ గ్రామ పరిసరాల్లో ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో 10 లీటర్ల సారా బుధవారం పట్టుకున్నారు. ఎస్.సుధాకర్ అనే వ్యక్తిని సారాతో పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఐటీఐలో స్వల్పకాలిక శిక్షణ కోర్సులు

గుమ్మలక్ష్మీపురం: ఉపాధి అవకాశాలు కలిగిన స్వల్పకాలిక కోర్సులను గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఆర్ఐటీఐలో ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన సౌజన్యంతో ఉపాధి అవకాశాలున్న అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ (ఫ్రాబ్రికేషన్) టెక్నీషియన్ కోర్సులు ప్రారంభిస్తామన్నారు. మూడు నెలల కాల పరిమితి గల ఈ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి కనపరిచే వారు విద్యార్హత ధ్రువపత్రాలతో పని వేళల్లో ఆర్ఐటీఐ కళాశాలకు వచ్చి అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 7981308986, 6304086821 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

అంకితభావంతో పని చేయండి


ఉపాధి పనుల స్థితిగతులపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలను పొందాలని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. మండలంలోని ఎల్.ఎల్.పురం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. అక్కడి రికార్డులు పరిశీలించారు. అనంతరం అక్కడ జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేతనదారులు, వారికి అందించిన మస్టర్ల వివరాలపై ఆరా తీశారు. పనులు జరుగుతున్న చోట ఉన్న మౌలిక సదుపాయాల గురించి వేతనదారులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల మేరకు వేతనం గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఫీల్డ్ సహాయకులకు సూచించారు.

ఉరిడి గ్రామానికి రహదారి వేయరూ..


ఉరిడి గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి

కురుపాం: మండలంలోని ఉరిడి గిరిజన గ్రామానికి రహదారి మంజూరు చేయాలని అధికారులను ఆ గ్రామ గిరిజనులు కోరారు. ఈ రహదారి విషయమై పలుసార్లు ఐటీడీఏ అధికారులకు విన్నవించినా స్పందన లేదని, రహదారి మొత్తం రాళ్లు తేలి అధ్వానంగా ఉండడంతో సమయానికి వైద్యసేవలు అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

పౌష్టికాహారం వినియోగించుకోవాలి


ఇంటింటికి వెళ్లి తల్లీపిల్లల ఆరోగ్యంపై వాకబు చేస్తున్న సీడీపీఓ విమలారాణి

భామిని: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ తులాల విమలారాణి అన్నారు. మండలంలో లివిరి, సొలికి అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించి అక్కడ తల్లులతో మాట్లాడారు. కేంద్రాల్లో అందుతున్న సేవలను ఇంటింటికి వెళ్లి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వినియోగించుకోవాలన్నారు. పిల్లల బరువుల రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు విషయంలో నిర్లక్ష్యం వీడాలి

సాలూరు: ప్రభుత్వ పథకాలు రైతులకు అందేందుకు ఈ క్రాప్ నమోదు కీలకమని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పెదపధం రైతుభరోసా కేంద్రం పరిధిలో ఏఓ అనూరాధ పండా ఆధ్వర్యంలో రైతులతో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం రబీ పంటలు సాగు చేస్తున్న రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ చేయకుంటే ప్రభుత్వ పథకాలు రైతులకు అందే అవకాశం ఉండదని హెచ్చరించారు. రైతులకు అవగాహన పెంపొందించాలని స్పష్టం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో 21 రకాల పంటలు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంతో 21 రకాల పంటలు దిబ్బగూడకు చెందిన రైతులు సృజన, శ్రీనివాసరావు పండిస్తున్నారని డీపీఎం షన్ముఖరాజు తెలిపారు. ఇది అభినందనీయమన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయి బృందం వచ్చి వీడియో చిత్రీకరించారని పేర్కొన్నారు. ఈ వ్యవసాయం ఎలా చేస్తున్నారు?, ఎటువంటి కషాయాలు వాడుతున్నారనేది తెలుసుకున్నారు. ఈ వీడియోను ఫిలిప్పిన్స్ లాంటి దేశాల్లో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యాన్ని, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో పలు పంటలు వేసుకోవడం వలన ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని ఇక్కడి రైతులు నిరూపించారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, సిబ్బంది పి.బాలు, ఎం.అంబోజీ, డి.శివాజి తదితరులు పాల్గొన్నారు.


రకాల పంటలను పరిశీలిస్తున్న డీపీఎం షన్ముఖరాజు తదితరులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గరుగుబిల్లి: ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులు వారోత్సవాలలో భాగంగా బుధవారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతను నిర్వహించారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఎన్ఎస్ఎస్ అధికారి హరిరామ్‌కుమార్ పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

‘చింత’ తీరింది


జీసీసీకి గిరిజనులు విక్రయించిన చింతపండు

సీతంపేట: గిరిజనులు సేకరించే చింతపండుకు భలే డిమాండ్ ఏర్పడింది. వ్యాపారులతో పోటాపోటీగా గిరిజన సహకార సంస్థ కూడా కొనుగోలు చేస్తుంది. గిరిజన రైతులు బుధవారం వారపు సంతకు తెచ్చిన చింతపండును జీసీసీ దాదాపు 30 క్వింటాళ్ల వరకు కిలో రూ.32.40 పైసలు చొప్పున సిబ్బంది కొనుగోలు చేశారు. దీంతో చింతను పండించే వారు సంబరపడ్డారు.

నవధాన్యాల సాగుతోనే అధిక దిగుబడులు

సీతానగరం: నవధాన్యాలు సాగు చేయడంతోనే భూమి సారవంతం, పోషకవిలువలు పెరిగి అధిక దిగుబడుల సాధనకు దోహద పడుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఎస్.కమల అన్నారు. ఈ మేరకు మండలంలోని నీలకంఠాపురంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానం అమలు కోసం అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమిలో పోషక విలువలు అభివృద్ధి చెంది పంటసాగు సమయంలో అధిక దిగుబడులు సాధించడానికి దోహపడుతుందన్నారు.రసాయన రహిత పంటలు సాగు చేయడం వల్ల రైతులు వ్యాధుల బారినుంచి రక్షించవచ్చన్నారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చే ఉపయోగాలు, ఎరువుల వినియోగం తగ్గుదల తదితరఅంశాలపై అవగాహ సదస్సులు నిర్వహించాలని సంకల్పించినట్లు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతుల్లో అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలనాయకులు వై.గోపాలనాయుడు, గ్రామ వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.


ర్యాలీలో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కమల

350 పశువులకు టీకాలు

బలిజిపేట: మండలంలోని వెంగళరాయపురంలో 350 పశువులకు బుధవారం గాలికుంటువ్యాధి టీకాలు వేసినట్లు మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సీతానగరం: మండలంలోని గుచ్చిమిలో రెండు రోజుల నుంచి జరుగుతున్న సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. ఆలయ అర్చకుడు కర్రి వెంకటరమణమూర్తి శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు సమకూర్చుకున్న సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అంతకు ముందు గ్రామంలోని పుర వీధుల్లో మేళతాళాలు, కోలాటాలతో తిరువీధి అనంతరం ఆలయంలో విగ్రహాలకు వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించామన్నారు. ప్రతిష్ఠ అనంతరం వందలాది మంది భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎం శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్ జగదీశ్వరరావు, ఉపసర్పంచ్ ఆర్ వెంకటరమణ, భజన మండలి సభ్యుడు బి.శంకరరావు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

సీతానగరం: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సమకూర్చిన వ్యాధినిరోధక టీకాలను నిర్దేశించిన గడువులోగా వైద్య సిబ్బంది వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు బుధవారం పెదంకలాం, బూర్జ గ్రామాల్లోని ఉపఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది వేస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన గడువులోగా వైద్యసిబ్బంది వేయాలని, అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాల వల్ల ఉపయోగాలు, పిల్లల తల్లులకు ఆరోగ్య పరమైన వివరాలపై అవగాహన కలిగించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలతల్లులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కుర్చీల వితరణ


కుర్చీలు వితరణగా ఇస్తున్న సర్పంచ్ జర్జాపు మోహన్

సాలూరు: మండలంలోని శివరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్థానిక సర్పంచ్ జర్జాపు మోహన్ కుర్చీలు వితరణగా అందజేశారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ కేంద్రానికి 20 కుర్చీలను ఇచ్చారు. ఈ క్రమంలో పిల్లలకు అవసరమైన ఇతర వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా అవసరమైతే తనను తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

పాలకొండ: పట్టణంలోని పలు కేంద్రాల్లో జరుగుతున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. సత్యసాయి జూనియర్ కళాశాల, తమ్మినాయుడు జూనియర్ కళాశాల, సాహితీ జూనియర్ కళాశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడా మాస్ కాపియింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా సాగాయి.


పరీక్ష కేంద్రంలో సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

ఘనంగా అమ్మవార్ల అనుపోత్సవం

సీతానగరం: మండలంలోని బూర్జ, తామరఖండి గ్రామాల్లో రెండు రోజులుగా జరుగుతున్న అమ్మవారి జాతరలు బుధవారం అనుపోత్సవంతో ముగిశాయి. కొత్తబూర్జ, పాతబూర్జ గ్రామాల్లో మంగళవారం రాత్రి తిరువీధి అనంతరం ఘటాలకు పూజలు చేసి అంగడిలో ఉంచారు. బుధవారం ఉదయం ఘటాలు ఉండే అంగడి నుంచి అమ్మవారి వనం గుడివరకూ మేళతాళాలతో ఘటాలను ఊరేగించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తామరఖండిలో జరిగిన చిన్నమ్మవారిజాతరను పురస్కరించుకుని రామమందిరం వద్ద ఉన్న అంగడి నుంచి వనంగుడి వరకూ తిరువీధి చేస్తూ అనుపోత్సవం నిర్వహించారు. మూడురోజులు మూడు గ్రామాల్లో అమ్మవారి జాతరలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆయాగ్రామాల్లో జాతరలు జరిగిన మూడు రోజులూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు, సీతానగరం పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.


బూర్జలో ఘటాలతో వనంగుడికి వెళ్తున్న భక్తులు


తారఖండిలో ఊరేగింపుగా పూజాసామగ్రితో గుడికి వెళ్తున్న భక్తులు

ఉపాధి పనులపై సమీక్ష

బలిజిపేట: ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ భానుమూర్తి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంతమందికి జాబ్‌కార్డులు ఉన్నాయి, ఆధార్ అనుసంధానం చేసుకున్నవారు ఎంతమంది, మిగిలినవారికి ఎందుకు అనుసంధానం జరగలేదు. ఉపాధిహామీ పథకంలో గృహనిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ ఎంతవరకు జరిగింది, రానున్న రోజుల్లో పనుల ప్రణాళిక, ఎంతమంది వేతనదారులు లెక్కలోకి వస్తారు. పనులు జరుగుతున్న వివరాలు, వేతనదారులకు గిట్టుబాటు వేతనం అందుతున్నదీ, లేనిదీ, వేతనదారులతో ఏవిధంగా పనులు చేయించాలి, పంచాయతీల వారీగా ప్రణాళిక పక్కాగా ఉన్నదీ లేనిదీ అన్న వివిధ అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న సమావేశం

వినియోగదారుడే రాజు

పార్వతీపురంటౌన్: న్యాయమైన వ్యాపారం, నాణ్యమైన వస్తుసేవలు అందిన రోజు వినియోగదారుడే రాజు అవుతాడని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధి చందక అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం పట్టణంలోని శ్రీవారి సన్నిధి కల్యాణమంటపంలో వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ డే కార్యక్రమాన్ని ఆ సంస్థ ప్రతినిధులు నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని, స్టిక్కర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు మోసపోకుండా ఉండేందుకు కన్స్యూమర్ రైట్స్, చట్టాలపై అవగాహన కలిస్తామన్నారు. అలాగే వ్యాపార సంస్థల యజమానులకు కూడా చైతన్యం కలిగిస్తామని చెప్పారు. ప్రతి వినియోగదారుడు తన హక్కులను తెలుసుకునేలా చైతన్యపరిచి వస్తువు కొనుగోలు సమయంలో నాణ్యమైన వస్తుసేవలు పొందేలా అవగాహన కల్పిస్తామన్నారు. మోసపోయిన వినియోగదారులు ఎవరైనా తమను సంప్రదిస్తే న్యాయపరంగా వారి వెంట ఉండి న్యాయం చేస్తామన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులకు సంబంధించి ప్యాకింగ్ చేసే సమయం, ఎప్పటి వరకు వినియోగించవచ్చనే సమయాన్ని తప్పక పరిశీలించాలని సూచించారు. జె.శ్రీనివాసరావు, వి.దాలినాయుడు పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న ఫోరం ప్రతినిధులు


నూతనంగా నిర్మించిన వీరఘట్టం కోటదుర్గతల్లి ఆలయం

ఆకట్టుకుంటున్న ఆలయ సౌందర్యం

జిల్లాలో ప్రాచుర్యం ఉన్న వీరఘట్టం కోటదుర్గతల్లి ఆలయ సౌందర్యం భక్తులను మంత్రముగ్ధులను చేస్తోంది. మూడున్నరేళ్లుగా ఎంతో పవిత్రంగా నిర్మించిన ఆలయం చుట్టూ నిర్మించిన దేవతామూర్తుల విగ్రహాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. గురువారం నుండి నూతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ నిర్మాణానికి విరాళాలిచ్చిన 250 మంది దాతలు సతీసమేతంగా పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. – వీరఘట్టం


ఆలయానికి పడమర దిక్కున ఏర్పాటు చేసిన భారీ అమ్మవారి విగ్రహం


భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయం బయట ఏర్పాటు చేసిన బలిదేవత విగ్రహం